రేవంత్.. ఉద్యమంలో నీ పాత్ర ఏంటి?

బీజేపీ రాష్ట్రప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): 'రేవంత్‌రెడ్డీ.. తెలంగాణ ఉద్యమంలో నీ పాత్ర ఏంటి? ఏ నాడైనా జై తెలంగాణ అని ఉద్యమించినవా?' అని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. ఉద్యమకారులపై దాడి చేసిన రేవంత్‌రెడ్డిని నాడు తెలంగాణ సమాజం ఛీ కొట్టిందని, ఇప్పుడు ఏదో లక్కీగా సీఎం అయ్యాడని ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంలో యాత్రలు, పోరాటాలు చేశారని, అనేకసార్లు అరెస్టు అయ్యారని చెప్పారు. ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రూ.13 వేల కోట్లు ఇస్తే మొత్తం రుణమాఫీ పూర్తవుతుందని చెప్పారని, కానీ సీఎం పాలమూరులో 3 వేల కోట్లతో రుణమాఫీ పూర్తయిందని ప్రకటించడం ఎంతవరకు కరెక్ట్ అని నిలదీశారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ ఏడాది పాలనలో ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని మండిపడ్డారు. ప్రాజెక్టులు రాకుండా అడ్డుకుంటూ డెమోలిషన్ మ్యాన్‌గా, పేదల ఇండ్లు కూల్చివేస్తూ డిస్మాంటిలింగ్ మ్యాన్‌గా, రాష్ట్రానికి విలువలేకుండా చేసి డీవ్యాల్యుయేషన్ మ్యాన్‌గా, ప్రజలకు ఇచ్చిన హామీల నుంచి దృష్టి మరల్చుతూ డైవర్షన్ మ్యాన్‌గా, చివరికి ఆయనే డిస్టర్బ్‌డ్ మ్యాన్‌గా మారారని ఎద్దేవా చేశారు.

ఉద్యోగి అంత్యక్రియల ఖర్చు 30వేలకు పెంపు

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఉద్యోగి మరణిస్తే మరణాంతర ఖర్చుల కింద అందజేసే మొత్తాన్ని ప్రభుత్వం పెంచింది. ఇది వరకు అంత్యక్రియల ఖర్చు కింద ఇచ్చే మొత్తం రూ.20వేలు ఉండగా, తాజాగా రూ.30వేలకు పెంచింది. సీఎస్ శాంతికుమారి సోమవారం జీవో-247ను విడుదల చేశారు. సర్వీసులో ఉండగా మరణించిన ఉద్యోగులకే ఈ మొత్తాన్ని ఇస్తారు. ఉద్యోగి అంత్యక్రియల ఖర్చులను రూ. 50వేలకు పెంచాలని పలు ఉద్యోగ సంఘాలు కొంత కాలంగా డిమాండ్ చేస్తున్నాయి.

కోకాకోలా కంపెనీ ప్రారంభోత్సవంలో పోలీసులపై రాళ్లు విసురుతున్న నిరసనకారులు

పరిశ్రమ ప్రారంభోత్సవ కార్యక్రమం ముగియక ముందే చించిపడేసిన సీఎం రేవంత్ ఫ్లెక్సీ

సీఎం టూర్‌లో కాంగ్రెస్ వర్గపోరు

- సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి ఆందోళన
- రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీల చించివేత.. పోలీసుల లాఠీచార్జి
- పోలీసులపైకి రాళ్లు విసిరిన కాంగ్రెస్ కార్యకర్తలు

సిద్దిపేట ప్రతినిధి/గజ్వేల్(నమస్తే తెలంగాణ),డిసెంబర్ 2: సిద్దిపేట జిల్లా ములుగు మండలం బండతిమ్మాపూర్‌లో కోకాకోలా కంపెనీ ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎదుటే గజ్వేల్ కాంగ్రెస్‌లో విభేదాలు రచ్చకెక్కాయి. తన వర్గీయులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదంటూ డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి ఆందోళనకు దిగారు. ఆయన వర్గీయులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీలను సైతం చించివేశారు. దీంతో పోలీసులు లాఠీలు ఝుళిపించి కాంగ్రెస్ కార్యకర్తలను చెదరగొట్టారు. కోకాకోలా కంపెనీ ప్రారంభోత్సవానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి తొలుత హెలిప్యాడ్ ప్రదేశం వద్ద జిల్లా అధికారులు, కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి.. మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌తో కలిసి కంపెనీ ప్రారంభోత్సవ వేదిక వద్దకు చేరుకోగా.. పోలీసులు తమకు అందిన జాబితా ప్రకారమే స్థానిక నేతలను ప్రారంభోత్సవ కార్యక్రమ వేదిక వద్దకు వెళ్లేందుకు అనుమతించారు. ఈ నేపథ్యంలో పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావుతోపాటు ఆయన వర్గీయులు లోపలికి వెళ్లారు. డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి తనవర్గం వారిని కూడా లోపలికి అనుమతించాలని కోరగా అందుకు పోలీసులు నిరాకరించారు. దీంతో నర్సారెడ్డి లోపలికి వెళ్లకుండా తన వర్గీయులతో కలిసి బయటనే బైఠాయించారు. దీంతో ఆగ్రహించిన ఆయన వర్గీయులు లోపలికి వెళ్లిన బండారు శ్రీకాంత్‌రావు వర్గీయులను బయటకు రప్పించాలంటూ ఆందోళనకు దిగారు. పోలీసులు నచ్చజెప్పినప్పటికీ వినకుండా అరగంటకుపైగా ఆందోళన కొనసాగించారు. బండారు శ్రీకాంత్‌రావుతోపాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీలను సైతం చించివేశారు. దీంతో పోలీసులు లాఠీచార్జి చేసి కార్యకర్తలను చెదరగొట్టారు. నర్సారెడ్డి వర్గీయులు రాళ్లు విసరడంతో పోలీసులు మరోసారి కార్యకర్తలను చెదరగొట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి కోకాకోలా కంపెనీ లోపల ఉండగానే ఇదంతా జరిగింది. తన వ్యక్తిగత సిబ్బంది ద్వారా ఈ విషయం తెలుసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆందోళన చేపడుతున్న నర్సారెడ్డితోపాటు పలువురిని లోపలికి పిలిపించుకున్నారు. దాంతో నర్సారెడ్డి వర్గీయులు ఆందోళన విరమించారు.

రంగారెడ్డిజిల్లాలో కులోన్మాద హత్య

- కులాంతర వివాహం చేసుకుందన్న కోపంతో అక్కను చంపిన తమ్ముడు
- మృతురాలు హయత్‌నగర్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్

నాగలక్ష్మి (ఫైల్)

రంగారెడ్డి / ఇబ్రహీంపట్నం రూరల్, డిసెంబర్ 2 (నమస్తేతెలంగాణ) : రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో కులోన్మాద హత్య రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఇబ్రహీంపట్నం పోలీసులు, రాయపోల్ గ్రామస్తుల కథనం ప్రకారం.. రాయపోల్ గ్రామానికి చెందిన నాగలక్ష్మి (26) 2022 బ్యాచ్‌లో కానిస్టేబుల్, హయత్‌నగర్ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నది. అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్‌ను ఎనిమిదేండ్లుగా ప్రేమించి 15 రోజుల క్రితం కులాంతర వివాహం చేసుకుని హయత్‌నగర్‌లో నివాసం ఉంటున్నది. తాను వారిస్తున్నా వినకుండా ప్రేమ పెళ్లి చేసుకోవడంతో తమ్ముడు పరమేశ్ అక్కపై కక్ష పెంచుకున్నాడు. ఆదివారం స్వగ్రామమైన రాయపోల్‌కు నాగలక్ష్మి వచ్చింది. సోమవారం నాగలక్ష్మి స్కూటీపై ఒంటరిగా పోలీసుస్టేషన్‌కు వెళ్తున్న విషయం తెలుసుకున్న పరమేశ్ కారులో వెంబడించాడు. రాయపోల్ నుంచి ఏండ్లగూడవైపు వెళ్తున్న రోడ్డులో ఆమె బైకును ఢీకొట్టాడు. కిందపడిపోయిన నాగలక్ష్మిని కత్తితో నరికి చంపాడు. అక్కడినుంచి ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్టు తెలిసింది. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాజేడు ఎస్సై ఆత్మహత్య

- రివాల్వర్‌తో కాల్చుకొని సూసైడ్
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు
- వ్యక్తిగత కారణలతోనేనని వెల్లడించిన ములుగు ఎస్పీ

హరీశ్ (ఫైల్)

వాజేడు, డిసెంబర్ 2 : ములుగు జిల్లా వాజేడు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న రుద్రరాపు హరీశ్(30) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని మండపాక గోదావరి బ్రిడ్జి సమీపంలోని ఫెరియాడో రిసార్ట్స్‌లో గది నంబర్ 107లో సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకున్నాడు. ఎస్పీ శబరీష్ ఘటన ప్రదేశానికి చేరుకొని ఎస్సై ఆత్మహత్య చేసుకున్న గదిని పరిశీలించారు. పోలీసులతోపాటు రిసార్ట్ నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత కారణలతోనే ఎస్సై ఆత్మహత్యకు పాల్పడ్డాడని, డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన ఎలాంటి ఒత్తిడి లేదని చెప్పారు. హరీశ్ సొంత గ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి మండలం వెంకటేశ్వరపల్లి. 2020 బ్యాచ్‌కు చెందిన హరీశ్ గతంలో వాజేడులో శిక్షణ ఎస్సైగా విధులు నిర్వర్తించారు. ఇదే మండలంలోని పేరూరు ఎస్సైగా, ములుగు ఎస్పీ ఆఫీసులో పనిచేశారు. 6 నెలల క్రితం ఎస్సైగా వాజేడుకు వచ్చారు.

యువతితో కలిసి వచ్చి గది అద్దెకు

ఆదివారం సాయంత్రం ఒక యువతితో కలిసి కారులో వచ్చిన ఎస్సై హరీశ్ ఫెరియాడో రిసార్ట్స్‌లో గది అద్దెకు తీసుకున్నట్టు నిర్వాహకులు తెలిపారు. రాత్రంతా గదిలోనే ఉన్నాడని, బయటకు వెళ్లి మళ్లీ ఉదయం వచ్చినట్టు తెలుస్తున్నది. ఈ నెల 14న ఎస్సైకి వేరే అమ్మాయితో నిశ్చితార్థం ఉన్నట్టు తెలుస్తున్నది. ఎస్సై మెడ చుట్టూ చున్నీ ఉండడంతో ఎస్సైది హత్యాలేక ఆత్మహత్యా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. యువతిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. ఎస్సై మృతిపై బంధువుల అనుమానాలు వ్యక్తం చేశారు.

ఏడాదిలోనే అద్భుతాలు జరుగుతయా?

- సంక్రాంతి తర్వాత రైతు భరోసా ఇస్తం
- ఆరోగ్య ఉత్సవాల్లో సీఎం
- 30 కిలోమీటర్లకో ట్రామా కేంద్రం
- మంత్రి దామోదర

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): తాము అధికారంలోకి వచ్చి సంవత్సరమే అయిందని, ఏడాదిలోనే అద్భుతాలు జరిగిపోతాయా? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఆరోగ్య ఉత్సవాల్లో సీఎం పాల్గొన్నారు. 213 కొత్త అంబులెన్స్‌లను జెండా ఊపి ప్రారంభించారు. 442 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు, 24 మంది ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందించారు.16 నర్సింగ్ కాలేజీలు, 28 ప్రభుత్వ అనుబంధ హెల్త్ కేర్ కాలేజీలు, 32 మిత్ర ట్రాన్స్ క్లినిక్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. తాము అధికారంలోకి రాగానే వైద్య, ఆరోగ్య శాఖలో 7,750 మందికి నియామక పత్రాలు అందజేశామని తెలిపారు. సంక్రాంతి తర్వాత రైతు భరోసా ఇచ్చి తీరుతామని తెలిపారు. మరో పదేండ్లు తమ ప్రభుత్వమే ఉంటుందని, బోనస్ కొనసాగిస్తుందని చెప్పారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం: దామోదర

ప్రజలు అనారోగ్యంతో అప్పులపాలు కాకూడదన్నదే తమ లక్ష్యమని, విద్య, వైద్యం వంటి కనీస వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. రాష్ట్రంలో మరో నాలుగు క్యాన్సర్ కేర్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి 30 కిలోమీటర్లకు ఒకటి చొప్పున 74 ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం, ప్రభుత్వ సలహాదారులు కేకే, వేం నరేందర్‌రెడ్డి, షబ్బీర్ అలీ పాల్గొన్నారు.

పాత నోటిఫికేషనే

సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి నియామకపత్రాలు అందజేసిన 24 మంది ఫుడ్ ఆఫీసర్ పోస్టులకు బీఆర్ఎస్ హయాంలోనే నోటిఫికేషన్ ఇచ్చింది. 2022 జూలై 21న టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. అదే ఏడాది నవంబర్ 7న రాత పరీక్ష నిర్వహించారు. న్యాయపరమైన సమస్యల కారణంగా మిగతా ప్రక్రియ ఆగిపోయింది.

స్పీచ్‌కు ముందే వెళ్లిపోయిన వైద్యులు

ఆరోగ్య ఉత్సవాల పేరిట తీసుకొచ్చి మంత్రులు రాజకీయ ప్రసంగాలు చేయడంపై సభకు వచ్చిన వైద్యులు అసహనం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతుండగా వారు మధ్యలోనే వెళ్లిపోయారు. డాక్టర్ల గ్యాలరీ ఖాళీగా మారడంతో అధికారులు కంగారుపడ్డారు. సీఎం ప్రసంగం ప్రారంభానికి ముందే గ్యాలరీని నింపేందుకు అందర్నీ బతిమాలి తీసుకురావాల్సి వచ్చింది.

పెట్టుబడులకు ఆకర్షణ శక్తిగా తెలంగాణ

- సిద్దిపేట జిల్లాలో కోకాకోల బేవరేజెస్
- ప్రారంభించిన సీఎం రేవంత్

గజ్వేల్, ములుగు, డిసెంబర్ 2: తెలంగాణ పెట్టుబడులకు ఆకర్షణ శక్తిగా వెలుగొందుతున్నదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హిందుస్థాన్ కోకాకోలా బేవరేజెస్ కంపెనీ ఏర్పాటుతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందనుందని ఆశాభావం వ్యక్తంచేశారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలం, బండతిమ్మాపూర్‌లో ఏర్పాటుచేసిన హిందుస్థాన్ కోకాకోలా బేవరేజెస్ అత్యాధునిక గ్రీన్‌ఫీల్డ్ కంపెనీని సోమవారం మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆధునికంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దిన ఈ పరిశ్రమ ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీలలో ఓ మైలురాయిగా నిలువనుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్‌సీ కూర రఘోత్తంరెడ్డి, సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, హెచ్‌సీసీబీ సీఈవో జువాన్ పాబ్లో రోడ్రిగ్స్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రూ. 2091కోట్లతో పరిశ్రమ ఏర్పాటు

ములుగు మండలం బండతిమ్మాపూర్‌లో టీఎస్ఐపాస్ సేకరించిన 49 ఎకరాల్లో రూ.2091 కోట్లతో పరిశ్రమను ఏర్పాటుచేశారు. పరిశ్రమలో వెయ్యి మందికి ఉపాధి అవకాశాలను కల్పించింది.

వర్గీకరణ ఆగదు

మొదటిపేజీ తరువాయి...

రాజ్యాంగ నిర్మాత ఫొటోను చిన్నగా పెట్టారని విమర్శించారు. అంబేద్కర్‌కు ఇచ్చే గౌరవం ఇదేనా? అని ప్రశ్నించారు. దేశంలో, రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను ధైర్యంగా వ్యతిరేకించే పార్టీలే లేవని, అన్ని పార్టీలూ సమర్థిస్తున్నాయని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ దళితుల ఐక్యతకు విఘాతమని చెప్పే ఆ నేత తండ్రి కాంగ్రెస్ సీనియర్ నాయకుడని, ఆయన కొడుకు కూడా ఆ పార్టీలోనే ఉన్నారని స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోరుకున్న పార్టీ కూడా కాంగ్రెసేనని, 1975లోనే పంజాబ్‌లో కాంగ్రెస్‌కు చెందిన మాజీ సీఎం జైల్ సింగ్ వర్గీకరణ అమలు చేశారని గుర్తుచేశారు.

2018లో రాహుల్‌గాంధీ హామీ

2018 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అధికారంలోకి వస్తే వర్గీకరణ అమలు చేస్తామని స్వయంగా ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని మందకృష్ణ తెలిపారు. ఇటీవల ఏఐసీసీ అధినేత మల్లికార్జున ఖర్గే చేవెళ్ల డిక్లరేషన్‌లో వర్గీకరణ అమలుపై హామీ ఇచ్చారని, ఆగస్టు 1న సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ తీర్పు అనంతరం మొదటగా తెలంగాణలో అమలు చేస్తామని సీఎం రేవంత్ ప్రకటిస్తే అదే వర్గీకరణను అడ్డుకుంటామని ఆ పార్టీలో ఉండి ఎలా అంటారని ప్రశ్నించారు.

నీ ఒంటి మీద 3 కండువాలు మారినయ్

వర్గీకరణకు మాయవతి వ్యతిరేకంగా ఉన్నారని చెప్పే బదులు ఆమె పార్టీలో చేరి వర్గీకరణకు వ్యతిరేకంగా ప్రచారం చేసుకోవాలని మందకృష్ణ దుయ్యబట్టారు. '30 ఏండ్లుగా నా ఒంటిపై నల్లకండువా మారలేదు.. కానీ నీ ఒంటిపై మూడు కండువాలు మారినయ్' అని సదరు నేతను ఉద్దేశించి ఎద్దేవాచేశారు. కాంగ్రెస్‌లో ఉన్న ఆ నేత తర్వాత బీఆర్ఎస్‌లో చేరాడని, వర్గీకరణకు పార్టీ అధినేత కేసీఆర్ అనుకూలంగా స్వయంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారని, నేరుగా ప్రధాని వద్దకు వెళ్లి త్వరగా వర్గీకరణ చేయాలని విజ్ఞప్తి కూడా చేశారని గుర్తుచేశారు. 'నువ్వు కండువాలు మార్చిన 3 పార్టీలు వర్గీకరణకు అనుకూలమే.. ఏ పార్టీ లో ఉంటావో తేల్చుకో' అంటూ సవాల్ చేశారు.

మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

కాంగ్రెస్ అధిష్ఠానం మౌనం వీడాలి

కాంగ్రెస్‌లో ఉండి, పదవులను అనుభవిస్తూ ఆ పార్టీ సిద్ధాంతానికి వ్యతిరేకంగా పోతున్న ఆ నేతలపై పార్టీ అధిష్ఠానం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చెప్పాలని, ఈ అంశంపై మౌనం వీడాలని డిమాండ్ చేశారు.

జనవరి 5న మాదిగ విద్యార్థి గర్జన సభ

జనవరి 5న ఓయూలో మాదిగ విద్యార్థి గర్జనసభ నిర్వహించనున్నట్టు విద్యార్థి నాయకులు ప్రకటించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ఈ సభను నిర్వహించనున్నట్టు చెప్పారు.

భర్తను చంపిన భార్య

- కుటుంబ కలహాలే కారణం
- సంగారెడ్డి జిల్లా మక్తక్యాసారంలో ఘటన

మునిపల్లి, డిసెంబర్ 2: కుటుంబ కలహాలతో భార్య.. భర్తను మట్టుబెట్టింది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లాలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. మునిపల్లి ఎస్సై రాజేశ్‌నాయక్ కథనం ప్రకారం.. మునిపల్లి మండలం మక్తక్యాసారం గ్రామానికి చెందిన మంజులకు హైదరాబాద్ శివారులోని శంషాబాద్‌కు చెందిన సంపత్‌తో 12 ఏండ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గతేడాది నుంచి వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు పంచాయితీ పెట్టినా గొడవలు తగ్గకపోవడంతో భర్తతో కొట్లాడి భార్య తల్లిగారి ఇంటికి వెళ్లింది. అప్పటి నుంచి భర్త సంపత్ భార్యను చూసేందుకు అప్పుడప్పుడు వచ్చి వెళ్తుంటాడు. పది రోజుల క్రితం సంపత్ మక్తక్యాసారం గ్రామానికి వచ్చి భార్య దగ్గరే ఉంటున్నాడు. ఆదివారం రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో మంజుల.. భర్తను కర్రతో కొట్టి ఇంట్లో నుంచి బయటకు తోసేసింది. తలకు బలమైన గాయం కావడంతో సంపత్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ ఎరువులు పంజాబ్‌కు తరలింపు!

- రాష్ట్రంలో తీవ్రంగా డీఏపీ కొరత
- ర్యాక్‌లను దించుకోని మార్క్‌ఫెడ్
- ఎరువుల కంపెనీలతో గూడుపుఠాణి
- అధికారుల అండతోనే గప్‌చుప్‌గా పంజాబ్‌కు తరలించిన కంపెనీలు
- రైతులను గాలికొదిలేసిన వ్యవసాయ శాఖ

చేతులెత్తేసిన ప్రభుత్వం

డీఏపీ ఎరువుల కొరత కారణంగా తెలంగాణ రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇటు మార్క్‌ఫెడ్ వద్ద, అటు ప్రైవేటు ట్రేడర్ల వద్ద అంతా కలిపి రెండు వేల టన్నులు కూడా డీఏపీ నిల్వ లు లేవని తెలిసింది. ఉత్తరాది రాష్ట్రాల్లో డీఏపీ కొరత ఏర్పడటంతో అక్కడి ప్రభుత్వాలు కేంద్రంతో చర్చలు జరిపి ఎక్కువ డీఏపీని సరఫరా చేయించుకుంటున్నట్టు సమాచారం. ఇందుకు పూర్తి భిన్నంగా తెలంగాణలో పరిస్థితి నెలకొన్నది. డీఏపీ కొరతపై ప్రభుత్వం వైపు నుంచి కనీస స్పందన కనిపించడం లేదు. వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు కూడా ఈ విషయాన్ని పట్టించుకోవడంతో రైతులకు కష్టాలొచ్చాయి.



హైదరాబాద్, డిసెంబర్ 2(నమస్తే తెలంగాణ): తెలంగాణ రైతులకు దక్కాల్సిన ఎరువులు పంజాబ్‌కు తరలిపోతున్నాయి. తెలంగాణ రైతులను గాలికొదిలేసి, పంజాబ్ రైతులకు ఎరువుల కొరత తీర్చేందుకు కంపెనీలు తహతహలాడుతున్నాయి. సదరు కంపెనీలకు మార్క్‌ఫెడ్‌లోని కొందరు కింది స్థాయి అధికారులు సహకరిస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే రాష్ట్రంలో అవసరమైన మేర డీఏపీ లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ రాష్ట్రానికి కేటాయించిన ఎరువుల ర్యాక్స్ (రైలులో వచ్చే ఎరువులు) వచ్చినప్పటికీ, వాటిని ఇక్కడ దించుకోకుండా తిరిగి పంపించేసినట్టు తెలిసింది. మార్క్‌ఫెడ్‌లోని కొందరు అధికారులు కంపెనీలతో కలిసి గూడుపుఠాణి నడిపినట్టు సమాచారం. రాష్ట్రానికి రేక్స్ వచ్చిన విషయం ఉన్నతాధికారులకు తెలియకుండా దాచేసినట్టు తెలిసింది. నవంబర్ నెల మొత్తం ఇదే తతంగం జరిగినట్టు సమాచారం.

పంజాబ్‌కు తరలింపు...!

ఈ సీజన్‌లో దేశవ్యాప్తంగా డీఏపీ కొరత నెలకొన్నది. పలు దేశాల్లో యుద్ధాల నేపథ్యంలో డీఏపీ తయారీకి అవసరమైన ముడిసరు కు ధరలు పెరగడంతో కంపెనీలు డీఏపీ దిగుమతిని, తయారీని తగ్గించేశాయి. దీంతో పంజాబ్, హర్యానా తోపాటు పలు ఉత్తరాది రాష్ట్రాల్లో తీవ్రంగా కొరత ఉన్నది. ఆయా రాష్ట్రాల్లో కొరత తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం కూడా మిగిలిన రాష్ట్రాల కేటాయింపుల్లో కోత పెట్టినట్టు తెలిసింది. తెలంగాణకు ఇవ్వాల్సిన ఎరువులను దొడ్డదారిలో తగ్గించేందుకు ఎరువుల కంపెనీలతో కథ నడిపించినట్టు తెలిసింది. రాష్ట్రానికి కేటాయించిన ఎరువులను రాష్ట్రానికి ఇవ్వకుండా పంజాబ్‌కు తరలించినట్టు వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. ఇందుకోసం సదరు కంపెనీలు వ్యవసాయ కమిషనరేట్, మార్క్‌ఫెడ్‌లోని కొందరు అధికారులను మచ్చిక చేసుకున్నట్టు తెలిసింది. రేకులు వచ్చిన విషయం ఉన్నతాధికారులకు చెప్పొద్దని సూచించినట్టు తెలిసింది. దీంతో రేకులు ఇక్కడికి రావడం, వెళ్లిపోవడం జరిగిపోయాయి.

అలా బయటపడింది

రాష్ట్రంలో డీఏపీ కొరత నేపథ్యంలో మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి 3 రోజుల క్రితం జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్లతో సమీక్ష నిర్వహించారు. ఎరువు ల నిల్వలపై ఆరా తీయడంతో రాష్ట్రానికి వచ్చి న ఎరువులు పక్కదారి పట్టిన విషయం వెలుగులోకి వచ్చింది. నవంబర్‌లో పలుమార్లు రేకులు రా ష్ట్రానికి వచ్చినప్పటికీ వాటిని ఇక్కడ దించుకోలేదని తేలింది. దీనిపై ఎరువుల విభాగం అధికారిని ఎండీ ఆరా తీ యగా, ఎరువుల రేకులు వచ్చిన విషయం త నకు తెలియదని చెప్పినట్టు తెలిసింది. దీంతో ఆ అధికారి నిర్లక్ష్యంపై ఎండీ ఆగ్రహం వ్యక్తంచేసినట్టు సమాచారం. డీఏపీ కొరత ఉన్నప్పుడు రేకులు ఎందుకు దించుకోలేదని, కంపెనీలు ఎరువులు ఇచ్చేందుకు నిరాకరిస్తే ఆ విషయం తమ దృష్టికి ఎందుకు తీసుకొనిరాలేదని నిలదీసినట్టు తెలిసింది. తమ దృష్టికి తీసుకొస్తే ఏపీసీ, డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లి కంపెనీలతో మాట్లాడి మనకు ఎరువులు ఇచ్చే విధంగా ప్రయత్నం చేసేవాళ్లం కదా? అని ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఇందుకు సదరు అధికారి మౌనమే సమాధానమైట్టు తెలిసింది.

పట్నం బెయిల్ పిటిషన్ విచారణ 5కు వాయిదా

లగచర్ల రైతుల పిటిషన్‌పై నేడు తీర్పు

వికారాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): లగచర్ల కేసులో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణను వికారాబాద్ జిల్లా కోర్టు మరోసారి పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం పట్నం నరేందర్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణను 5కు వాయిదా వేసింది. నవంబర్ 13న నరేందర్‌రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరోవైపు లగచర్ల రైతుల బెయిల్ పిటిషన్‌పై వాదనలు పూర్తికాగా తీర్పును వికారాబాద్ జిల్లా కోర్టు మంగళవారానికి వాయిదా వేసింది.

కోర్టులో లొంగిపోయిన లగచర్ల నిందితులు

కొడంగల్, డిసెంబర్ 2: వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో గత నెల 11న జరిగిన ఘటనకు సంబంధించిన కేసులో నిందితులు నలుగురు సోమవారం కొడంగల్ కోర్టులో లొంగిపోయారు. ఉదయం న్యాయవాదితో కలిసి లగచర్ల గ్రామానికి చెందిన నార్ల హన్మంతు, కుమ్మరి శివకుమార్, దొరమోని రాంచందర్, రోటిబండతండాకు చెందిన లోక్యా నాయక్ కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరై లొంగిపోగా 14 రోజులపాటు రిమాండ్ విధించారు.

యూజీసీకి నోచుకోని మహిళా వర్సిటీ

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన మహిళా యూనివర్సిటీ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఈ వర్సిటీ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) గుర్తింపు లేకుండా నడుస్తున్నది. విద్యార్థులు ప్రవేశాలు పొందుతున్నారు.. క్లాసులు నడుస్తున్నాయి. కానీ ఈ వర్సిటీని ఏర్పాటు చేస్తూ ఇప్పటి వరకు అసెంబ్లీలో చట్టాన్ని రూపొందించకపోవడంతో యూజీసీ గుర్తింపును దక్కించుకోలేకపోయింది. ఇటీవలే ఈ వర్సిటీ పేరును కాంగ్రెస్ ప్రభుత్వం వీరనారి చిట్